క్లుప్తంగా

గర్భిణులకు మెడికల్ కిట్ల అందజేత


మెడికల్ కిట్లు అందజేస్తున్న నాయకులు

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం వీరన్నపల్లి గ్రామంలో గురువారం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు గర్భిణులకు మెడికల్ కిట్లు పంపిణీ చేశారు. ట్రస్టు చైర్మన్, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ వెంకటేశ్ ఆధ్వర్యంలో కిట్లను సమకూర్చారు. ఆశ కార్యకర్త శోభ, నాయకులు రాఘవేందర్, దేవేందర్, యాదయ్య, భరత్ ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత


బాధితుడికి చెక్కు అందజేస్తున్న నాయకులు

కడ్తాల్: ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యమని పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండల పరిధి మైసిగండి గ్రామానికి చెందిన విశాల్‌నాయక్‌కు ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన రూ.44 వేల చెక్కును గురువారం బాధిత కుటుంబ సభ్యులకు ఆయన అందజేశారు. పేదల ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం సీఎం సహాయ నిధి పథకాన్ని అమలు చేస్తోందని, అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు హీరాసింగ్, తులసీరాం, రాజు, విజయ, శారద, గోపాల్, చందు, సాయి, రమేశ్, బాష, సురేశ్, బీచ్యా, రమేశ్ తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి


గేదె కళేబరం

మంచాల: వ్యవసాయ పొలంలో విద్యుత్ షాక్‌తో ఓ పాడి గేదె మృతి చెందింది. ఈ సంఘటన మంచాల మండలం లోయపల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కావలి పోషమ్మ- అంజయ్య దంపతులకు పాడి పశువులే జీవనాధారం. ఎప్పటిలాగే గురువారం ఉదయం మెండికట్ట చెరువు సమీపంలోని వ్యవసాయ పొలానికి పశువులను మేతకు తీసుకెళ్లారు. మేత మేస్తున్న క్రమంలో పొలంలోని వ్యవసాయ బోరు విద్యుత్ వైర్లు పశువుకు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. చనిపోయిన గేదె విలువ సుమారు రూ.లక్ష 50 వేలు ఉంటుందని, బాధిత రైతును ప్రభుత్వం ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు మహేందర్‌జీ కోరారు.

వర్షాలకు కూలిన ఇల్లు



ఇబ్రహీంపట్నం: రెండు రోజులుగా కురిసిన వర్షానికి ఇబ్రహీంపట్నం అంబేడ్కర్‌నగర్‌లోని ధార లావణ్యకు చెందిన ఇల్లు కూలిపోయింది. వర్షాలకు ఇంటి స్లాబ్ భాగం నుంచి నిమ్ము వచ్చి పైకప్పు గురువారం ఉదయం కూలింది. ఆ సమయంలో ఇంటి అవరణలో ఎవరూ లేక పోవడంతో ప్రమాదం తప్పింది. దినసరి కూలీగా పనిచేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాని, పేదరికంతో బాధపడుతున్నామని, తమకు ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేసి ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు కోరారు. ఈ మేరకు తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకున్నామని తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన సీఎస్‌కే విల్లా కమిటీ సభ్యులు

షాద్‌నగర్: మున్సిపాలిటీ పరిధిలోని సీఎస్‌కే విల్లా నూతన కమిటీ సభ్యులు గురువారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కలిశారు. ఈ సందర్భంగా విల్లాలో అభివృద్ధి కార్యక్రమాలపై వారు ఎమ్మెల్యేతో చర్చించారు. త్వరలో పరిగి రోడ్డు నుంచి సీఎస్‌కే వరకు 5 కోట్ల రూపాయలతో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

క్వారీ.. ప్రాణాలు హరి

ఈత సరదా ప్రాణాలను హరిస్తోంది. లోతు తెలియకనో, ఈదడం రాకనో క్వారీలో దిగిన వారిలో అత్యధికులు ప్రాణాలు కోల్పోతున్నారు. క్వారీ పేరు చెబితే.. బాబోయ్ బోరబండ గని అంటూ భయాందోళన చెందుతున్నారు.

- వేసవిలోనే తరచూ ప్రమాదాలు
- ఈత సరదాతో 20 మందికి పైగా మృత్యువాత
- కంచె లేకపోవడమే కారణం
- భయాందోళన చెందుతున్న పట్టణ ప్రజలు


కొంగరకలాన్ బోరబండ క్వారీ

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీ కొంగరకలాన్ కలెక్టరేట్ కార్యాలయం వెనుక ఉన్న బోరబండ క్వారీ అనేక ప్రాణాలను బలిగొంటోంది. ఈత సరదాతో అందులోకి దిగిన వారు విగత జీవిగా మారుతున్నారు. ఏటా వేసవిలో ఇలాంటి విషాద ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. చుట్టూ ఎలా కంచెలేక పోవడమే ప్రమాదాలకు కారణమని తెలుస్తోంది.

రింగురోడ్డుకు మట్టితరలింపు

పురపాలిక ప్రాంతంలో బోరబండ క్వారీ గని తెలియని వారు లేరు. ఈ క్వారీని 2006 ఔటర్ రింగ్‌రోడ్డు నిర్మాణం నేపథ్యంలో ఇక్కడి నుంచే మట్టిని తోడి, తరలించారు. దీంతో అక్కడ 50 అడుగులకు పైగా పెద్ద గొయ్యి ఏర్పడింది. ఇందులో కాలంతో పనిలేకుండా నిత్యం నిండుకుండలా నీరు ఉండటం గమనార్హం. చుట్టూ రాతి ఉండి.. మధ్యలో నీరు ఉండటంతో దీనిని చూసేందుకు, ఇందులో స్విమ్మింగ్ చేసేందుకు చాలా మంది వస్తుంటారు. ఈ గనిలో ఈత కొట్టేందుకు నగరం నుంచి కూడా వెళ్తుంటారు.

చర్యలు శూన్యం

2006 నుంచి నేటి వరకు ఈ క్వారీలో 20 మందికి పైగా యువకులు మునిగి చనిపోయారు. వారం రోజుల క్రితం ఉప్పుగూడ ప్రాంతానికి చెందిన ఓ విద్యార్థి నీట మునిగి మృత్యువాత పడ్డాడు. ఇలాంటి సంఘటనలు ఇక్కడ నిత్యం జరుగుతూనే ఉన్నాయి. అయినప్పటికీ సంబంధిత అధికారులు తగిన జాగ్రత్త చర్యలు తీసుకోలేక పోతున్నారు. కలెక్టరేట్ ప్రారంభానికి ముందు కలెక్టర్ అమోయ్ కుమార్ బోరబండ క్వారీ చుట్టూ పెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారని, అయినా ఇప్పటి వరకు ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోలేదని పట్టణ ప్రజలు వాపోతున్నారు.

నీరు తేటగా.. రాళ్లు పదునుగా


బోరబండ గని

క్వారీలో నీరు తేటగా ఉంటాయి. అందులో రాళ్లు మాత్రం పదునుగా ఉంటాయి. ఈత కోసం గనిలో దూకిన వారు ఈత రాకనో, రాళ్లు కోసుకుపోయో, లోతు తెలియక ప్రమాదశాత్తు నీట మునిగితే.. రెండు మూడు రోజుల వరకు వారి మృతదేహాలు లభించడం కష్టమేనని జరిగిన సంఘటనలు రుజువు చేస్తున్నాయి. జరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని, వెంటనే క్వారీ చుట్టూ పెన్సింగ్ ఏర్పాటు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

ఫెన్సింగ్ ఏర్పాటు చేయండి



బోరబండ క్వారీలో ఈత కోసం చాలా మంది వస్తుంటారు. లోతు తెలియక ఈత తెలియని వారు దిగి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ప్రమాదాల నివారణకు అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టాలి. గని చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయించాలి.

– లింగాళ్ల మహేందర్, కొంగరకలాన్

రక్షణ చర్యలు చేపడతాం



బోరబండ ఓపెన్ గనిలో ఈత సరదా ప్రాణాలు తీస్తోంది. అయితే మద్యం సేవించి స్విమ్ చేసేందుకు దిగడంతోనే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. అలా జరగకుండా రక్షణ చర్యలు చేపడతాము. గతంలో పెట్రోలింగ్ చేశాము. సిబ్బందిని నియమించి, అక్కడికి ఎవరు వెళ్లకుండా చూస్తాం. ప్రమాదాల గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం.

– రాఘవేందర్‌రెడ్డి, సీఐ, ఆదిబట్ల

పంటమార్పిడి.. అధిక దిగుబడి

- భూసారం మెరుగుతో రైతుకు మేలు
- వ్యవసాయ శాస్త్రవేత్తలు


రైతుసదస్సులో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌గౌడ్

ఆమనగల్లు: పంటమార్పిడితో భూసారం మెరుగుపడి, అధిక దిగుబడులు వస్తాయని ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ నిర్మల, డాక్టర్ చరితాదేవి, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆమనగల్లు మండలం చింతలపల్లి గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ×రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు× అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

నూనెగింజల సాగు బాగు

ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ.. ఒకే రకం పంటను పదేపదే వేయడం వలన మట్టిలో పోషకాలు తగ్గి, దిగుబడి పడిపోతుందని తెలిపారు. అందువలన మట్టిశక్తి పెరగడానికి పంటల మార్పిడీ విధానం అవసరమని, రైతులు ఈ విధానాన్ని పాటించాలని సూచించారు. జీవ ఎరువు, సేంద్రియ ఎరువుల వినియోగం వలన భూసారం పెరుగుతుందని, యూరియాను మోతాదులో వాడటంతో నేలపై ప్రతికూల ప్రభావాలు తగ్గుతాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న యంత్రాలు, ట్రాక్టర్, డ్రిప్ ఇరిగేషన్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. అలాగే నూనెగింజల పంటలు, కూరగాయల సాగుద్వారా మంచి ఆదాయం వస్తుందని, రైతులు వాటిని సాగుచేయడానికి ప్రాధాన్యత ఇవ్వాలని వారు కోరారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం విద్యార్థులు స్వప్నశ్రీ, ఏఈఓ కేదార్, రైతులు పాల్గొన్నారు.


ఇబ్రహీంపట్నంలో.. శోభాయాత్ర

వైభవంగా.. హనుమాన్ జయంతి

హనుమాన్ జయంతి వేడుకలు గురువారం ఇబ్రహీంపట్నం, ఆమనగల్లు తదితర ప్రాంతాల్లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అష్టోత్తర నామాలు, హనుమాన్ చాలీసాపఠనం, సుందరకాండ, పల్లకీ సేవ తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తజనం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విశ్వహిందు పరిషత్, బజరంగ్‌దళ్‌ల ఆధ్వర్యంలో వాయుపుత్రుడి శోభాయాత్ర కనుల పండువగా చేపట్టారు. యువకులు, నాయకులు, ప్రజాప్రతినిధులు, భక్తులు కాషాయ జెండాలతో ఉత్సాహంగా ర్యాలీలు తీశారు.

–సాక్షి, నెట్‌వర్క్


యాచారం: నందివనపర్తిలో పూజలు అందుకుంటున్న వాయిపుత్రుడు


కడ్తాల్: హన్‌మాన్ ఆలయంలో భక్తుల పూజలు


కడ్తాల్: స్వామి వారికి పల్లకీసేవ


యాచారం: నందివనపర్తిలో బైక్ ర్యాలీ

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు


ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న చైర్ పర్సన్ తదితరులు

- మార్కెట్ చైర్ పర్సన్ గీత, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్

కడ్తాల్: అర్హులందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇస్తుందని ఆమనగల్లు మార్కెట్ చైర్ పర్సన్ యాట గీత, వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధి కర్కల్‌పహాడ్ గ్రామంలో పలువురు లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు అందజేశారు. ఇళ్ల నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఇరువురు మాట్లాడుతూ.. కల్వకుర్తి నియోజకవర్గానికి 4500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యాయని, పేదలకు ఇళ్లు కేటాయించేందుకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు బాలరాజు, నాయకులు బోసురవి, హీరాసింగ్, షాబుద్దీన్, సైకలాబ్, కృష్ణయ్య, అశోక్, వీరయ్య, అర్జున్, జలాలుద్దీన్, శివరాజు, ఆంజనేయులు, రమేశ్ తదితరులు ఉన్నారు.

మైసిగండి మైసమ్మకు ప్రత్యేక పూజలు

మండల పరిధి మైసిగండి మైసమ్మకు చైర్ పర్సన్ యాటగీత ప్రత్యేక పూజలు చేశారు. పాడి పంటలతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్‌కు, ఆలయ నిర్వాహకులు శాలువా, పూలమాలతో సన్మానించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. నాయకులు జవహర్‌లాల్, హీరాసింగ్, తులసీరాం, షాబుద్దీన్, ఆలయ అర్చక సిబ్బంది ఉన్నారు.

నిరుపేదలకు..

ఇల్లులేని పేదలకు సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి అందిస్తుందని పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం మండల పరిధి మైసిగండి గ్రామంలో పలువురు లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. అధికారులు, నాయకులతో కలిసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. పంచాయతీ కార్యదర్శి జంగయ్య, నాయకులు జవహర్‌లాల్, హీరాసింగ్, శారద, రాజు, విజయ, ఛత్రు, తుల్సీరాం ఉన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

యాచారం: యాచారం మండలంలో శుక్రవారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి పర్యటించనున్నారని ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పర్యటనలో భాగంగా మధ్యాహ్నం రెండు గంటలకు యాచారం రైతు వేదికలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేయనున్నారని ఆమె పేర్కొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ

కడ్తాల్: మండల పరిధి మైసిగండి గ్రామంలో వారం రోజులుగా నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ పోటీలు గురువారంతో ముగిశాయి. ఈ మేరకు నిర్వహించిన బహుమతి ప్రదానంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు.. విజేత జట్టు జవహర్‌లాల్‌కు రూ.15 వేలతో పాటు షీల్డ్ అందించగా, రన్నరప్‌గా నిలిచిన జట్టుకు బీజేపీ జిల్లా నాయకుడు రాందాస్‌నాయక్ రూ.11 వేలు, జ్ఞాపికను బహూకరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు రెడ్యానాయక్, హీరాసింగ్, తులసీరాం, శివనాయక్, మల్లేశ్‌రాథోడ్, శ్రీను, కల్యాణ్, భాస్కర్, సుమన్, సాయికుమార్ తదితరులు ఉన్నారు.

ఏసీపీకి సన్మానం

షాద్‌నగర్: బదిలీపై వెళ్తున్న పట్టణ ఏసీపీ రంగస్వామి గురువారం ఎమ్మెల్యే వీర్లపల్లిను శంకర్‌ను క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయనకు శాలువా కప్పి, పూలమాల వేసి సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్రామిరెడ్డి, కృష్ణారెడ్డి, ముబారక్, ఇబ్రహీం, రాయికల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్పష్టతలేని పెండింగ్ బిల్లులు

- రూ.1,200 కోట్లకు.. రూ.153 కోట్లు ఎలా విడుదల చేస్తారు?
- సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి



కడ్తాల్: పెండింగ్ బిల్లుల విడుదలలో స్పష్టత లేదని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 12,769 గ్రామ పంచాయతీలకు గాను రూ.1200 కోట్లు బకాయి ఉండగా, కేవలం రూ.153 కోట్లు మాత్రమే విడుదల చేయడమేంటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పంచాయతీల వారీగా బకాయి ఎంత, విడుదల చేసిన బిల్లులు ఎన్ని, ఇంకా ఎంత పెండింగ్‌లో ఉందో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అప్పు చేస్తున్న కార్యదర్శులు

పాలకవర్గాలు లేక, పంచాయతీ కార్యదర్శులతో గ్రామాల్లో పాలన కొనసాగిస్తున్నారని మాజీ సర్పంచ్ పేర్కొన్నారు. నిధులు లేక.. కార్యదర్శులు వారి జీతాలతో పాటు, అప్పులు తెచ్చి గ్రామాలకు వెచ్చిస్తున్నారని తెలిపారు. పంచాయతీ కార్యదర్శుల పెండింగ్ బిల్లులు ఎన్ని ఉన్నాయే తెలపాలని కోరారు. గ్రామాల వారీగా ఎస్‌డీఎఫ్, సీడీఎఫ్, ఎస్ఎఫ్‌సీల ద్వారా చేపట్టిన పనులకు, ఇప్పటి వరకు ఎన్ని బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి, ఎంత విడుదల చేశారు, మిగిలినవి ఎంత తదితర అంశాలకు సంబంధించి శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు.

ప్రాణాలతో చెలగాటం..

అప్పు చేసిన గ్రామాలను అభివృద్ధి చేసిన మాజీ సర్పంచ్‌ల ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. చేసిన పనుల బిల్లుల కోసం ఏడాదిన్నర కాలంగా ఎన్నో పోరాటాలు చేశామని, ఎందరో సర్పంచ్‌లు ఆత్మహత్య చేసుకున్నారని పేర్కొన్నారు. అయినా బిల్లుల విషయంలో ప్రభుత్వం జాప్యం చేయడం దారుణమన్నారు. ఇదీ ప్రజాస్వామ్య విరుద్ధమని ధ్వజమెత్తారు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని, లేని పక్షంలో స్థానిక సంస్థల ఎన్నికలను అడ్డుకుంటామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

షాబాద్: ఆధ్యాత్మిక చింతనతోనే ప్రతీ ఒక్కరికి మానసిక ప్రశాంతత కలుగుతుందని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీంభరత్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని నాన్‌ధార్‌ఖాన్‌పేట్ గ్రామంలో బొడ్రాయి, మైసమ్మ దేవతల విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమంలో భీంభరత్, మండల నాయకులు పాల్గొని అమ్మవార్లకు పూజలు చేశారు. రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి ఉన్నారు.

రాజ్యాంగ పరిరక్షణే ధ్యేయం


మాడ్గుల: లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

- మత విద్వేషాలను రెచ్చగొడుతున్న కేంద్రం
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- జంగారెడ్డిపల్లి, మాడ్గులలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల అందజేత

ఆమనగల్లు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలతో రాజ్యాంగానికి ప్రమాదం ఏర్పడిందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగ పరిరక్షణకు ప్రజలంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. తలకొండపల్లి మండలం జంగారెడ్డిపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన జైబాపు, జై బీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, ఇందిరాగాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాజ్యాంగ పరిరక్షణ యాత్ర నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేంద్రం మత రాజకీయాలకు పాల్పడుతూ.. విద్వేషాలను రెచ్చగొడుతుందని, ఐక్యతను దెబ్బతీస్తుందని ఆరోపించారు. ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న బీజేపీ ప్రభుత్వ తీరును ఎండగట్టాలని కోరారు. రాజ్యాంగ పరిరక్షణే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా ఉద్యమిస్తుందని ఆయన చెప్పారు.

ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన

జంగారెడ్డిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే కసిరెడ్డి శంకుస్థాపన చేశారు. అంతకు ముందు లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వరలక్ష్మి, నాయకులు రాజేందర్‌రెడ్డి, రఘురాములు, డేవిడ్, హరిమోహన్‌రెడ్డి, చంద్రారెడ్డి, రమేశ్‌యాదవ్, యాదయ్య, అజీజ్, రేణురెడ్డి, అంజయ్య, వెంకట్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, అజీం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ చేతల ప్రభుత్వం

మాడ్గుల: కాంగ్రెస్ చేతల ప్రభుత్వమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో పలువురు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రాలు అంజేశారు. ఈ సందర్భంగా రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఇచ్చిన హామీ మేరకు అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు కేటాయిస్తామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం మాటలతో కాలక్షేపం చేసిందని, అధికారంలో ఉండి దోచుకొని దాచుకుందని, రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి పెట్టలేదని ఆరోపించారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని, ఇచ్చిన మాటను నిలబెట్టుకుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బట్టు కిషన్ రెడ్డి, సీనియర్ నాయకులు రాంరెడ్డి, కొండల్ రెడ్డి, రాములు, యాదయ్య, బాబా, విష్ణు తదితరులు పాల్గొన్నారు.